

# లవ్ ఎట్ ఫస్ట్ సైట్

—యండమూరి వీరేంద్రనాథ్

ఆ చిన్న సంఘటనతో తన జీవితం అలా మలుపు తిరుగుతుందని అతనుకోలేదు. చాలా మామూలుగానూ, అనుకోకుండానూ జరిగింది.

రాత్రి ఎనిమిదింటికి సుదర్శన్ ఇంటర్నేషనల్‌లో కాన్ఫరెన్సు ముగించుకొని అతను ఇంటికి వస్తున్నాడు. సౌత్ హిల్స్ ఏరియాలో విసిరేసినట్టున్న ఇళ్ళమధ్య చిన్న బంగళా అతడిది.

వర్షపు జల్లు అలలు అలలుగా పడుతోంది. పైకి ఎత్తిన గాజు అద్దాల సందుల్లోంచి చల్లటిగాలి రివ్వున వీస్తోంది. కొండల మధ్య నుంచి దారి కారు లైట్ల కాంతిలో మెలికలు తిరిగిన పాములా మెరుస్తోంది. చాలాసేపటినుంచి వర్షం కురుస్తూ ఉండడం వల్ల రోడ్డు నిర్మానుష్యంగా ఉంది.

అతను ఇంకో అయిదు నిమిషాల్లో ఇల్లు చేరుకోబోతా ఉనగా, కారు కుడివైపుకి మలుపు తిరుగుతూ ఉంటే హెడ్ లైట్ల వెలుగులో ఆమె చెట్టుపక్క నుంచి చెయ్యి కదపటం క్షణంలో వెయ్యోవంతులో చూశాడు.

కీచుమన్న బ్రేకుల శబ్దంతో కారు ఆగింది.

అతడు తల తిప్పి కారు వెనక అద్దంగుండా చూశాడు. ఆమె తెల్లచీరె రోడ్డు పక్క ఉన్న వీధి లైటు కాంతిలో అస్పష్టంగా కనిపిస్తోంది.

'ఆమె చెయ్యి ఎత్తి లిఫ్టు అడిగిందా? లేక పొరపాటున నేనే కారు ఆపుచేశానా?' అనుకొన్నాడు అతడు.

అతడికి ఆడవాళ్ళతో మాట్లాడటమూ, పరిచయం చేసుకోవటమూ, ఒకింత చొరవ తీసుకోవటమూ లాంటి విషయాలు తెలియవు. నిద్రపోవటానికి తప్ప మిగతా సమయమంతా తన బిజినెస్ గురించి ఆలోచించటానికే సరిపోతుంది అతడికి.

ఎవరో అమ్మాయి రోడ్డు పక్కగా నిలబడగానే కారు ఆపుచేసి తన అసంకల్పిత చర్యకు సిగ్గుపడి అతడు కారు తిరిగి స్టార్ట్ చెయ్యబోయాడు. కానీ, అంతలోనే ఆమె చెట్టుపక్కనుంచి కారువద్దకు రావటం రియర్ విండోలోంచి గమనించాడు. అతడి గుండె వేగంగా కొట్టుకోసాగింది. పక్కకు వంగి, కారుకు అటువైపు ఉన్న గాజు అద్దం కిందకి దింపాడు. ఈ లోపుగా ఆమె కారు దగ్గిరికి చేరుకుంది. విండో లోంచి లోపలికి చూస్తూ, 'ఉడ్ యూ మైండ్ గివింగ్ మి ఎ లిఫ్ట్ అప్ టు ది ఎయిర్ పోర్ట్? ఇఫ్ యూ డోన్ట్ మైండ్, ప్లీజ్!' అన్నది.

*　　*　　*　　*

కారు రెండవ వైపు అద్దం కూడా కిందికి దించటం వల్ల చలిగాలి మరింత బలంగా లోపలికి వీస్తోంది. అయినా, అతడికి అది అంతగా పట్టలేదు.

అతడికి అడుగున్నర దూరంలో కూర్చున్నది ఒక అమ్మాయి అన్న భావన అతడికి చాలా థ్రిల్‌గా ఉంది. సెక్సువల్‌గా కాదు—కేవలం థ్రిల్లింగ్‌గా.

దూరంగా పల్లంలో ఊరు తాలూకు మిణుకు మిణుకు మంటున్న దీపాలు దీపావళి రోజు ప్రమిదల్లా ఉన్నాయి.

"మీ ఇల్లు ఈ ప్రాంతాల్లోనే అయితే నా గురించి ఎయిర్‌పోర్ట్ వరకు వచ్చే శ్రమ తీసుకోకండి" అందామె ఇంగ్లీషులో.

"అబ్బెబ్బె! అటువంటిదేమీ లేదు" అన్నాడు అతడు తడబడుతూ. అటువంటిదేమీ లేదు అనటంలో ఉద్దేశం తన ఇల్లు ఇటే అనో, శ్రమ తీసుకోవటం లేదు అనో ఆమెకు తెలియనివ్వకుండా.

"నా పేరు కల్పన. బి. ఎస్సి. ఫైనలియర్ చదువుతున్నాను. నాన్నగారు రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. ఆఫీసరు. ఎయిర్ పోర్ట్ ఎదురుగా ఉండే కాలనీలో ఉంటున్నాం" అంది ఆమె.

"నా పేరు నవీన్ చంద్ర. ఎమ్. బి. ఎ. చేశాను. ఆ తరువాత ఫిలిప్స్‌లో రెండు సంవత్సరాల ట్రైనింగ్. ఆర్థర్ అండ్ హాయిలీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాను. నాన్న లేరు. అన్నయ్య

అమెరికాలో డాక్టరు. అమ్మ నాతోనే ఉంటుంది. మా కంపెనీ వాళ్ళు ఇల్లు ఇచ్చారు. నా జీతం ...'' అని ఏదో అనుమానం వచ్చినట్టు తలతిప్పి చూశాడు. ఆమె తల దించుకొని తనలో తనే నవ్వుకోవటం అస్పష్టంగా కనిపించింది. తాను అవసరమైనదాని కంటే ఎక్కువ పరిచయం చేసుకుంటున్నానని గమనించి అతడి మొహం సిగ్గుతో ఎర్రబడింది. చెప్పిన మాట మార్చాలి కనక, ఏం మాట్లాడాలో తెలియక, అంతలోనే ఎయిర్ పోర్ట్ సమీపించటం చూసి, ''కొంచెం టీ తాగ వెళదామా?'' అన్నాడు.

ఆమె అది ఊహించనట్టు అతడి వైపు చిత్రంగా అర్థం కానట్టు చూసింది. ఆమె మౌనాన్ని అంగీకారంగా భావించి అతడు కారును ప్రక్కన ఎడమ పక్కకు కోశాడు.

ఎయిర్‌పోర్ట్‌లోకి దారి అందంగా ఉంది. రోడ్డుకు ఇరుపక్కలా దీపాలు. చుట్టూ లాన్, పూల మొక్కలు. దూరంగా బిల్డింగ్‌పైన నెమ్మదిగా తిరుగుతున్న లైటు.

అతడి కారు పార్కింగ్ స్పేస్‌లోకి వెళ్ళి ఆగింది. అప్పుడు ఎనిమిదిన్నర అయింది.

* * * *

''మీరు డబ్బు బాగా ఖర్చు పెడతారనుకొంటానే?'' అందామె, పై అంతస్తులో కాంటీన్‌లో కూర్చున్నాక.

''ఎందుకలా అనుకొంటున్నారు?''

''కప్పు టీ తాగటానికి కారు పార్కింగ్‌కు రూపాయి, లోపలికి రావటానికి రెండు రూపాయలు ఖర్చు పెట్టటం చూసి.'' నవ్విందామె.

అతడు మాట్లాడలేదు.

దూరంగా వర్షంలో తడిసిన రన్‌వే, అటూ ఇటూ ఉన్న ఎర్రటి, నీలపు లైట్లు దివిటీలు పట్టుకున్న సైనికుల్లా, ఎక్కడో దూరంగా వెలుగులతో కలిసిపోయిన చీకటి, అస్పష్టమైన నిశ్శబ్దం—అన్నీ అతడికి అదొకవిధమైన, అంతకు ముందెప్పుడూ లేని ఒక విచిత్రమైన అనుభూతిని కలగజేస్తున్నాయి. ఆ ట్రాన్స్‌నుంచి బలవంతంగా బయటపడి—''నిజానికి నేను చాలా జాగ్రత్తగా, పొదుపుగా ఖర్చు పెడతానని అంటూ ఉంటారు మా స్నేహితులందరూ'' అన్నాడు. ఆమె తల పైకెత్తి నవ్వింది. అంతలో

> ఏ మానవుడు అయినా కేవలం తాను సృష్టించిన దానికి అనుగుణంగా మాత్రమే ముందడుగు సాగిస్తాడు.
>
> —గైరీ గారోమి

వెయిటర్ వచ్చాడు. ''రెండు సాండ్ విచెస్, కట్‌లెట్, టీ విత్ మీడియమ్ షుగర్.'' ఆర్డరిచ్చాడు.

''ఇదేమిటి? టీ అనిచెప్పి డిన్నర్ ఆర్డర్ ఇచ్చారు?'' అన్నది కల్పన. ''మీరు భోజనం చెయ్యలేదా?''

అతడు తల అడ్డంగా ఊపి, ''ఇప్పుడే కాన్ఫరెన్సు నుంచి ఇంటికి వెళ్ళుతున్నాను'' అన్నాడు.

''నేను సౌత్ హిల్స్‌లో ఉన్న స్నేహితురాలి ఇంటికి వెళ్ళాను. వర్షం వచ్చేటట్టు ఉంది, వెళ్ళవద్దన్నారు నాన్నగారు. ఫర్వాలేదన్నాను.'' నవ్వింది. ''సన్నగా పడే వర్షం అంటే భలే ఇష్టం నాకు. కానీ, అంతలో వర్షం ఎక్కువైంది. అసలు జనసంచారం లేకపోవటంతో మరీ భయం వేసింది. ఆ చెట్టు వెనక నిలబడ్డాను. ఒక్క ఆటో కూడా రాలేదు. రెండు, మూడు కార్లు వెళ్ళాయి. ఆపుదామంటే భయం. ఏం చెయ్యాలో తోచక తటపటాయిస్తున్న సమయంలో మీ అంతట మీరే కారు ఆపు చేశారు.''

'మీరు చెయ్యి ఎత్తి ఆపు చెయ్యమనలేదా?' అని అడుగుదామనుకున్నాడు కానీ, ఎందుకో అడగలేదు.

భయం భయంగా చీకటి రోడ్డుమీద నిలబడి ఉన్న అమ్మాయికీ, ధైర్యంగా, వెళుతూన్న కారు ఆపుచేసి ఎక్కే అమ్మాయికీ చాలా భేదం ఉంది.

ఆమె అంటూంది—''మీరు కానీ కారు ఆపు చెయ్యకపోతే ఏం చేసేదాన్నో? చీకటి పడుతూన్న కొద్దీ భయం ఎక్కువ అవుతూంది. అప్పటికే మా స్నేహితురాలింటినుంచి చాలా దూరం వచ్చేశాను. వర్షంలో తడవటం కదా? అసలు టైమే తెలియలేదు.''

అతడు ఆమె నాజూకైన చేతివేళ్ళకేసీ, మణికట్టు మీది రిస్ట్‌వాచ్‌కేసీ, మోచేతిమీద అందమైన ముడత కేసీ, బిగుతైన జాకెట్టు చెంపకేసీ, తెల్లటి మెడకేసీ, నంపు తిరిగిన గెడ్డంకేసీ, పైన ఎర్రటి క్రింది


# ఉమేష్ యోగ దర్శన్

(ప్రథమ ముద్రణ)

(ఇంగ్లీషులో లేదా హిందీలో)

'ఎ గైడ్ టు హెల్తీ లివింగ్' (ఆరోగ్య జీవనానికి మార్గం). యింటింట్లో ఉండి తీరాలి! సచిత్రమైన యీ పుస్తకంలో వివిధ యోగాసనాలున్నాయి వివరంగా—వాటితో మీ శరీరాన్ని చక్కని ఆరోగ్యమైన స్థితిలో ఉంచుకోవచ్చు. మలబద్ధం మొదలైన యితర అస్వస్థతలను దూరంగా ఉంచవచ్చు. దాంతోబాటే మనశ్శాంతిని యిస్తుంది. అన్ని ఆసనాలూ పూర్తిగా వివరించబడినాయి, రోగ పరీక్షను గూర్చిన సూచనలూ, ఆహార నియమాలూ పొందుపరచబడినాయి.

ధర : హిందీ (రు. 30/-): ఇంగ్లీషు (రు. 30/-) పోష్టు ఖర్చులు అదనం : 5/-

## శ్రీ రామ్‌తీర్థ్ యోగాశ్రమ్

Tel. దాదర్ (మధ్య రైల్వే), బొంబాయి 400 014. ఫోన్ : 442899.




పెదవికేసీ, ఆపైన కొనదేలిన ముక్కుకేసీ, ఇంకా ఆపైన కళ్ళకేసీ చూసి, ఒకసారి కళ్ళూ కళ్ళూ కలుసుకోగానే నవ్వి, ''పొరపాటేం లేదు. నా అదృష్టం. కాదు అదృష్టం'' అన్నాడు.

అంతలో వెయిటర్ ట్రేతో వచ్చాడు. బల్ల మీద ప్లేట్లు నీట్‌గా సర్ది వెళ్ళిపోయాడు. ఆమె కట్‌లెట్‌ని కత్తితో కోస్తూ, ''మీరు ఇలాగే కార్లు ఆపుతూ ఉంటారా లిఫ్ట్ ఇవ్వటం కోసం?'' అంది.

ఈ ప్రశ్న అతడు ఊహించనిది. కానీ, చాలా నిజాయితీగా—''ఊహూం. సాధారణంగా ఎవ్వరూ ఆడగరు'' అన్నాడు.

''మరి, నేనూ అడగలేదుగా?''

ఆమె చీకట్లో అస్పష్టంగా చెయ్యి ఎత్తినట్టు కనుపించిన సంగతి చెబుదామనుకున్నాడు కానీ, ఇరిటేట్ చేసినట్టు ఉంటుందని చెప్పలేదు. టాపిక్ మార్చి—''మీ హాబీస్ ఏమిటి?'' అన్నాడు.

ఆ తరవాత వాళ్ళ సంభాషణ ఇంకో వైపుకి మళ్ళింది. ఒకరి అభిరుచులు, చూసిన ప్రదేశాలు, రాజకీయాలు, ఒలింపిక్స్—అన్నీ చుట్టి బిల్ ఎవరు ఇవ్వాలి అన్న విషయం మీద ఘర్షణ పడి, చివరికి బయటికి వచ్చారు.

అప్పుడు తొమ్మిదయింది.

* * * *

''ఎటు మీ ఇల్లు?'' కారు ఎయిర్‌పోర్ట్ బయటికి తీసుకువస్తూ అడిగాడు. రోడ్డు కవతలి వైపునున్న కాలనీ చూపించిందామె.

పోష్ కాలనీ.

ప్రతి ఇంటి చుట్టూ చిన్న తోట, పోర్టికో.

''మీ నాన్నగారికి ఎంతమంది సంతానం?''

''నేనొక్కతినే కూతుర్ని. అదిగో—ఆ అశోక వృక్షాలున్న ఇల్లే'' అంది చూపిస్తూ. అతడు కారు ఆపుచేశాడు.

ఆమె అతడివైపు చూసి నవ్వింది క్షణం సేపు. కారు దిగకుండా అతడూ అనుకొన్నాడు, ఆమె ఒక క్షణంపాటు అలాగే కూర్చుని ఉంటే బాగుండునని, ఆ క్షణం ఎన్నో క్షణాలైతే మరీ బాగుండునని.

అయ్యాయి.

ఆమె తేరుకొని, ''వెళ్ళొస్తాను. రేపు రండి. నాన్నగారిని పరిచయం చేస్తాను. అండ్ థాంక్యూ ఫర్ ది నైస్ రైడ్ అండ్ ఎ కప్ ఆఫ్ టీ'' అన్నది.

అతడు ఆమె వైపు ఆరాధనగా చూస్తూ నెమ్మదిగా అన్నాడు—''కల్పనా, ఐ లైక్ యూ'' అని.

* * *

అతడు టై నాట్ సర్దుకొంటూంటే వెనక నుంచి వచ్చింది కల్పన. కారు తాళాలు అందిస్తూ, ''సాయంత్రం తొందరగా వస్తున్నారా?'' అని అడిగింది. తల దువ్వుకుంటూన్న అద్దంలో ఆమెను చూస్తూ, ''వచ్చేస్తాను. ఏం?'' అని అడిగాడు.

''నేనూ సాయంత్రం షాపింగ్‌కు వెళదామనుకొంటున్నాను'' అంది. ఆమె చేతినుంచి తాళంచేతులతో నాటితో పాటు ఆమె చేతులనూ తీసుకుంటూంటే తాళంచేతులు క్రింద పడిపోయాయి, ఖాళీ అయిన చేతులు రెండు చేతులలో నిమగ్నం కాబోతూంటే

"ఏమిటిది, పెళ్ళయి ఆర్నెల్లు కావస్తూంటే!" అంది చిరుకోపంతో.

"ప్రేమకీ, కాలానికీ సంబంధం లేదోయ్! అందు లోనూ మనది లవ్ ఎట్ ఫస్ట్ సైట్" అన్నాడు.

"సైట్ అంటే జ్ఞాపకం వచ్చింది. మా స్నేహితు రాలి ఇంటికి కూడా వెళ్ళాలి. చాలా కాలం అయింది చూసి" అన్నది.

"సరే. అయితే, నేను ఆరింటికి వస్తాను ఇంటికి" అన్నాడు అతడు, కారు వద్దకు నడుస్తూ. "కొంచెం ఆలస్యంగానే వస్తానులే."

అతడు ఆఫీసుకు చేరుకునేసరికి పదింపావు అయింది. దాదాపు నాలుగు గంటల వరకు అతడు ఊపిరి సలపని పనులలో మునిగిపోయాడు. కిటికీ మీద చప్పుడు కావటంతో అతడు తల తిప్పి చూశాడు. బయట హోరున వర్షం. అప్పుడు జ్ఞాపకం వచ్చింది అతడికి—కల్పన సాయంత్రం షాపింగ్‌కు వెళ్ళి అక్కడి నుంచి వెస్ట్ హిల్స్‌లో ఉన్న తన స్నేహితురాలి ఇంటికి వెళతానని చెప్పటం.

అతడికి ఎందుకో మనసంతా చికాకుగా ఉన్నట్టు తోచింది. అయిదవుతూండగా ఆఫీసు నుంచి బయటికి వచ్చాడు. ఇంటికి వెళ్ళిపోదామను కున్నాడు. కల్పన లేకపోయినా ఫర్వాలేదు. తన దగ్గర డూప్లికేట్ తాళం ఉంది.

అతడు కారులో కూర్చుని స్టార్ట్ చేశాడు. వర్షం తగ్గింది. కానీ, తుంపర సన్నగా పడుతూంది. మేఘాలు అలుముకోవటం వల్ల అప్పటికే బాగా చీకటి పడిపోయింది.

అతడు ఇంటి సమీపానికి చేరుకునేసరికి అయిదుంపావు అయింది. లోపలికి వెళ్ళబోయి మనసు మార్చుకుని, కారుని ఎడమ వైపుకి తిప్పాడు. రెండు కిలోమీటర్ల దూరంలో వెస్ట్ హిల్స్. అయితే,అతడికి కల్పన స్నేహితురాలి ఇల్లు తెలియదు. అదీకాక కల్పన షాపింగ్ తరవాత స్నేహితురాలి ఇంటికి వచ్చిందో, వర్షాన్ని చూసి ఇంటికే వెళ్ళిపోయిందో తెలియదు. మరి,తనెందుకు ఇలా ఈ కొండల్లో తిరుగుతున్నట్టు?

తన చర్యకు తనే నవ్వుకుని కారు ఇంటి వైపు వెనక్కు తిప్పాడు అతడు.

పావు తక్కువ ఆరు కావస్తూంది.

బాగా చీకటి పడిపోయింది. వంద గజాల దూరంలో వస్తువుకూడా కనుపించడం లేదు. రోడ్డు మీద లైట్లుకూడా చీకటిని పారదోలలేక పోతు న్నాయి. కారు అద్దాల్లోంచి చలి గాలి బలంగా లోపలికి వీస్తూంది.

అకస్మాత్తుగా అతడు కారు స్లో చేశాడు.

దూరంగా చెట్టు కింద ఒక అమ్మాయి నిలుచుని ఉంది. మసక చీకట్లో అస్పష్టంగా, తెల్ల చీర కట్టుకుని కనుపిస్తూంది.

కల్పనే!

కారు నెమ్మదిగా ఆమెకు దగ్గిర అవుతూంది.

తనది నల్లకారు అనీ, తన కారు ఈ దారిలో రావటాన్ని ఆమె వూహించదనీ, తన కారు హెడ్ లైట్లు ముందుకు పడటం వల్ల కారు రంగు అవతలి వ్యక్తికి కనుపించదనీ, కేవలం ఒక కారు వస్తూన్నట్టు మాత్రమే తెలుస్తుందనీ అతడు భావించాడు. మరి కల్పన కారును ఆపుతుందా, చెయ్యి ఎత్తి? ఈ మసక చీకట్లో, పరాయి వాడి కారును ఆపి...? ఎక్కుతుందా?

అదిగో...ఆమె అడుగు ముందుకు వేసింది.

. . . . . . .

కల్పన అడుగు ముందుకు వేసింది.

ఫర్లాంగు దూరం నుంచి అయినా ఆమె తన కారు చప్పుడు గుర్తు పట్టగలదు. ఆమెకు సంతోషం కలిగింది. ఆ సంతోషంలోనే అడుగు ముందుకు వేసింది.

కానీ, అంతలోనే ఆమెకు ఒక అనుమానం వచ్చింది.

చెట్టు చాటున ఉన్న తనను అతడు పోల్చుకో లేడని ఆమె భావించింది. కేవలం ఒక స్త్రీ–నిర్మా నుష్యమైన రోడ్డు మీద కనబడితే కారు ఆపు చేసేస్తాడా అతడు? ఏమో? చూడాలి.

ఆమె అలాగే నిలబడి ఉంది.

కారు దగ్గిర అవుతూంది.

తన భార్య చెయ్యి ఎత్తి పరాయి వాడి కారు ఆపుచేస్తుందా అని అతను డ్రైవ్ చేస్తూ ఆలోచి స్తున్నాడు.

తన భర్త కారు ఆపి, పరాయి స్త్రీకి లిఫ్ట్ ఇస్తాడా అని ఆమె వేచి ఉంది ...

ఆమె చెయ్యి ఎత్తి కారు ఆపిందా? అతడు కారు తనంతట తానే ఆపుచేశాడా?అన్నది ఇక్కడ ఈ కథకు అప్రస్తుతం. ★

